ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 12 మార్చి 2024

సొంతూరికి సీఎం రాకతో..

పులివెందుల అష్టదిగ్బంధనం

- భారీగా బారికేడ్లతో మోహరించిన పోలీసులు
- షాపుల మూసివేతతో బంద్‌ను తలపించిన పులివెందుల
- సర్కిల్స్, ప్రధాన రోడ్ల దిగ్బంధనంతో.. ఇబ్బందులు పడ్డ ప్రజలు, విద్యార్థులు
- కారులో నుంచే సీఎం అభివాదం
- నిరుత్సాహంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

పులివెందుల టౌన్, మార్చి 11: సీఎం సొంతూరి పర్యటన గట్టి భద్రత మధ్యన సాగింది. ఎక్కడచూసినా బ్యారికేడ్లు, రోప్‌లతో 1462 మంది పోలీసు సిబ్బందితో పాటు సచివాలయం, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల సిబ్బందిని భద్రతకు ఉపయోగించారు. పులివెందుల పట్టణం చుట్టూ ఉన్న రింగురోడ్డు సర్కిల్స్, పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ పోలీసులు బ్లాక్ చేయడంతో రోజూ కార్యకలాపాలు చేసుకునే ప్రజలు ఇబ్బంది పడ్డారు. పబ్లిక్ పరీక్షలు రాసి వెళ్లే ఇంటర్ విద్యార్థులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు గమ్యాలు చేరుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు. ఎక్కడ చూసిన ప్రధాన రోడ్ల వద్ద పోలీసులు బారికేడ్లతో మోహరించారు. మన ఊరికి మన సీఎం వస్తున్నారు .. దూరంగా ఉండి అయిన చూద్దాం అనుకున్న పార్టీ నాయకులకు కానీ, కార్యకర్తలకు కానీ, సామాన్య ప్రజలకు ఈ భద్రతావలయం తీవ్ర నిరాశ నింపింది. సీఎం అల్లంత దూరాన కారులోనుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. దీనితో సామాన్య ప్రజలు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు.


తండ్రికి తనయుడికి ఎంత తేడా..

సీఎం పర్యటన కోసం అధికారులు ఎక్కడికక్కడ వ్యాపార కేంద్రాలన్నీ మూత వేయించారు. గతానికి ప్రస్తుతానికి ఎంతతేడా ఉంది అంటూ ప్రజలు బాహాటంగానే అధికారులపై మండిపడ్డారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎప్పుడు పులివెందుల పర్యటనకు వచ్చిన ప్రధాన రోడ్లను బంద్ చేయనిచ్చే వారు కాదు. ఓపెన్ టాప్ కార్‌పై ఉండి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు వెళ్లేవారు. కానీ ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రం తన సొంత ఊరిలో ప్రజల్లోకి రావడానికి భయపడుతున్నారంటే మాకేమీ మేలు చేస్తారు అని ప్రజలు బాహాటంగానే మాట్లాడుకుంటున్నారు. కనీసం ప్రజలు తమ సమస్యల గురించి అర్జీలు ఇద్దాం అనుకున్నా స్వీకరించే నాథుడు లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇలా వచ్చి రిబ్బన్ కట్ చేసి వెళ్లడానికి పులివెందులకు రావడం దేనికో.. తాడేపల్లి నుంచే బటన్ నొక్కి ప్రారంభం చేయొచ్చు కదా అంటూ ప్రజలు బాహాటంగానే మండిపడ్డారు.

రూ.861.84కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం పులివెందుల నియోజకవర్గ పరిధిలో రూ.861.84కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. రూ.500కోట్ల నాబార్డు, ఆర్‌ఐడీఎఫ్-37 నిధులు వెచ్చించి నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ గవర్నమెంట్ మెడికల్ కళాశాల, గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) భవనాలకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. పులివెందుల మైన్స్ సమీపంలో రూ.20.15 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ బనానా ప్యాక్ హౌస్ భవనాన్ని సీఎం ప్రారంభించారు. పులివెందులలో 2.79ఎకరాల్లో రూ.38.152కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ మినీ సెక్రటేరియట్ కాంప్లెక్స్ భవనాన్ని ప్రారంభించారు. ఇందులో ఆర్డీఓ, స్పందన హాల్, అగ్రికల్చర్, పేఅండ్‌అకౌంట్స్, సబ్‌ట్రెజరీ కాన్ఫరెన్స్ హాల్, పాడా ఆఫీస్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ కార్యాలయాలు, సీడీపీఓ కార్యాలయం, రెండు కాన్ఫరెన్స్ హాళ్లు ఉన్నాయి. పులివెందుల పట్టణ నడిబొడ్డున రూ.70లక్షలతో నిర్మించిన వైఎస్సార్ జంక్షన్‌ను, రూ.11.04కోట్లతో అభివృద్ధి చేసిన సెంట్రల్ బోలేవార్డును, రూ.20.69కోట్లతో నిర్మించిన వైఎస్ జయమ్మ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ భవన సముదాయాన్ని సీఎం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రూ.80లక్షలతో నిర్మించిన గాంధీ జంక్షన్‌ను, రూ.65.99కోట్లతో వంద ఎకరాల్లో ఏర్పాటుచేసిన డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా ప్రైవేట్ పార్ట్నర్ ఆధ్వర్యంలో రూ.175కోట్లతో 16.63 ఎకరాల్లో నిర్మించిన ఆదిత్య బిర్లా యూనిట్‌ను ప్రారంభించారు. ఇడుపులపాయ ఎస్టేట్‌లో రూ.39.13కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ పార్క్‌ను ప్రారంభించారు.

ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేశ్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కృష్ణబాబు, కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, జేసీ గణేశ్‌కుమార్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి, కడప నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీఓ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు. కాగా.. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 10.22గంటలకు కడప విమానాశ్రయం చేరుకున్న సీఎం జగన్న ఇక్కడ నుంచి హెలిక్యాప్టరులో పులివెందుల వెళ్లారు. నియోజకవర్గ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం సాయంత్రం 5.10గంటలకు కడప విమానాశ్రయం చేరుకుని విమానంలో గన్నవరం వెళ్లారు.



సీఎం పర్యటన సందర్భంగా మూతపడ్డ దుకాణాలు



ఇంటిగ్రేటెడ్ బనానా ప్యాక్ హౌస్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం లోపల పరిశీలిస్తున్న సీఎం



పులివెందుల గవర్నమెంట్ ఆసుపత్రి ఎదుట మెడికల్, నర్సింగ్, ఆసుపత్రి సిబ్బందితో సీఎం వైఎస్ జగన్

అర్జీలు స్వీకరించిన అధికారులు, సిబ్బంది



వైఎస్సార్ జంక్షన్ వద్ద ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న జిల్లా ఉన్నతాధికారులు

పులివెందుల రూరల్, మార్చి 11: ముఖ్యమంత్రి పర్యటించే ఆయా ప్రాంతాలలో సచివాలయ సిబ్బంది ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రారంభోత్సవాలకు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైపు అర్జీదారులు కాగితాలు చూపెడుతుండగా జిల్లా ఉన్నతాదికారులు వాటిని తీసుకున్నారు. ప్రతి ప్రారంభోత్సవాల వద్ద ప్రజలు అర్జీలతో కనిపించారు. స్వయంగా ముఖ్యమంత్రికి సమస్యలు విన్నవించుకుందామన్న ప్రజలకు నిరాశే మిగిలింది.



నిర్మానుష్యంగా పూలంగళ్ల సర్కిల్



మున్సిపల్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి సీఎం రాకతో ఎవరినీ రానివ్వకుండా బారికేడ్లు వేసిన పోలీసులు



వైఎస్సార్ మెడికల్ కాలేజీ ఎదుట బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు



సీఎంను కలిసి అర్జీ ఇచ్చేందుకు వచ్చిన వారిని పక్కకు వెళ్లమని సూచిస్తున్న పోలీసులు

జగన్ ఇంటికి వెళ్లేందుకు సిద్ధం

- అందుకే రాష్ట్రవ్యాప్తంగా బ్యానర్లు
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య



కడప (మారుతీనగర్), మార్చి 11: జగన్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పలికేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారనే సంగతిని ఆయన ముందే పసిగట్టి ఇంటికి వెళ్లిపోవడానికి సిద్ధపడే రాష్ట్రవ్యాప్తంగా సిద్ధం బ్యానర్లను ఏర్పాటు చేసుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కడపలోని తన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాలుగున్నర సంవత్సరాలకు పైగా వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో దోచుకోవడం-దాచుకోవడానికే పరిమితమైందని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల ఆస్తులకు కూడా ఇవాళ రక్షణ లేకుండా పోయిందన్నారు. ఏ మాత్రం కనికరం లేకుండా పన్నుల మీద పన్నులేస్తూ పీక్కుతింటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరకు చెత్త మీద కూడా పన్ను వేసిన ఇలాంటి చెత్త ముఖ్యమంత్రి మన దేశంలో ఎక్కడా లేరన్నారు. రాష్ట్రంలో దశల వారీగా మద్యాన్ని పూర్తిగా ఎత్తివేసి రానున్న ఎన్నికల్లో ఓట్లడుగుతానని డబ్బాకొట్టిన జగన్‌రెడ్డి, ఇచ్చిన హామీని అటకెక్కించి నాసిరకమైన జె.బ్రాండ్లను అధికరేట్లకు అమ్ముతూ ఖజానా నింపుకోవడం దారుణమన్నారు. వాటిని తాగడం వలన చాలా మంది ప్రజలు పిచ్చివాళ్లుగా మారుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలోనే సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న జగన్‌రెడ్డి మాటలు ఏమయ్యాయో ఈ పాటికి ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ తెలిసిపోయిందన్నారు. జగన్‌రెడ్డి ఇసుకను బంగారంగా మార్చి ప్రక్క రాష్ట్రాల్లో వందల కోట్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. 22 మంది ఎంపీలను ఇచ్చినా జగన్‌రెడ్డి రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. సింహం సింగిల్‌గా వస్తుందంటూ భజన బ్యాచ్‌తో ప్రకటనలు ఇప్పిస్తున్నారని, మామూలుగా జంతువులు అడవుల్లో ఉండాలే కానీ ప్రజల మధ్య ఉంటే ప్రజలకు ప్రమాదం అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌రెడ్డిలాంటి జంతువును ప్రజలు అడవికి పంపించడమే తరువాయన్నారు. సిద్ధం సభలకు జనం రాకపోయినా డబ్బులు-మద్యం ఎరగా చూపి పేదలను బస్సుల ద్వారా తీసుకెళుతున్నతీరు మరీ దారుణమన్నారు. దీంతో సామాన్య ప్రజలకు ఆయా డిపోలలో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులపాలవుతున్నారన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మాట్లాడుతూ.. కమలాపురం తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డిపై అతని కుటుంబ సభ్యులపై పనిగట్టుకుని మరీ కేసులు బనాయించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఈ విషయంలో పోలీసులు సైతం ఏకపక్షంగా వ్యవహరించడం అంతకన్నా మంచిది కాదన్నారు. ఈ విషయంలో పోలీసుల తీరుపై సెంట్రల్ హోమ్ మినిస్టర్, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

పులివెందుల మున్సిపాలిటీకి గ్రేడ్-1 స్థాయి

పులివెందుల రూరల్, మార్చి 11: పులివెందుల మున్సిపాలిటీ గ్రేడ్-1 స్థాయి దక్కించుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వైశ్రీలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్-1 మున్సిపాలిటీగా అప్‌గ్రేడేషన్ చేసేందుకు మున్సిపల్ కమిషనర్ మరియు కౌన్సిల్ తీర్మానంతో పాటు నివేదికలు సమర్పించారు. ఈ నివేదికలలో ఐదు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఆదాయ, వ్యయ వివరాలు తెలియజేశారు. మున్సిపల్ చట్టం ప్రకారం ప్రతిపాదనలు పరిశీలించిన అనంతరం సెకండ్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న పులివెందులను ఫస్ట్ గ్రేడ్‌కు అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ జారీ చేశారు.

రాష్ట్రాన్ని లూటీ చేసిన జగన్

- బీసీలలో రాజకీయ తిరుగుబాటు జరగాలి
- బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్



బహుజనుల ఐక్యత చాటుతున్న బోడె రామచంద్ర యాదవ్ తదితర నేతలు

ప్రొద్దుటూరు, మార్చి 11: జగన్ ఈ ఐదేళ్లలో రాష్ట్రాన్ని లూటీ చేయడం తప్ప ప్రజలకు మేలు చేసిందిలేదని, ఆయన మా జీ సీఎం మాత్రమే కాదు.. మాజీ ఎమ్మెల్యే కూడా కాబో తున్నారని భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ జోష్యం చెప్పారు. సోమవారం సాయంత్రం ప్రొద్దుటూరులోని టీటీడీ కల్యాణ మండపంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర సహాయకార్యదర్శి, బీసీ యువజన సైన్యం అధ్యక్షుడు కరుణాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో బహుజనుల ధర్మ పోరాట సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా ఈ రాష్ట్రంలో బీసీలను అన్ని రాజకీయ పార్టీలు వంచించాయన్నారు. రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలు తాము అధికారంలోకి వస్తే ఈ రాష్ట్రంలో రైతులను ఆదుకుంటామని యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడంలేదన్నారు. జగన్ ఈ ఐదేళ్లలో రాష్ట్రాన్ని లూటీ చేయడం తప్ప ప్రజలకు మేలు చేసిందిలేదన్నారు. ఇసుక నుంచి గనులు భూములు వనరులన్నీ దోచాడన్నారు. జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగానే కాకుండా ఎమ్మెల్యేగా కూడా ఓడించి మాజీ ఎమ్మెల్యేగా ఇంట్లో కూర్చోపెట్టేందుకు పులివెందుల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. హ్యూమన్ రైట్స్ సహాయ కార్యదర్శి కరుణాకర్ యాదవ్ మాట్లాడుతూ ప్రొద్దుటూరులో బీసీలు అధికంగా ఉన్నా రెడ్లకు తప్ప బీసీలకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీసీలకు ఎమ్మెల్యే స్థానం కల్పించే వరకు బహుజన శంఖారావం ఇక్కడి నుంచే పూరిస్తామన్నారు. సామాజిక కార్యకర్త డాక్టర్ మల్లెల భాస్కర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అన్ని కులాలకు ఇస్తూనే బీసీలకు దళితులకు మాత్రమే ఇచ్చామని మ భ్యపెడుతున్నారన్నారు. రెడ్లకు కమ్మలకు ఎంత మేలుచేసింది ఆయా పార్టీలు ప్రకటించాలన్నారు. రాష్ట్రంలోని గనుల లీజుల్లో బీసీలకు ఎంత మందికి ఇచ్చారో చెప్పగలరా అన్నారు. బీసీకు ఎమ్మెల్యే ఎంపీ సీట్ల కేటాయింపుల్లో జనాభా దామాషా ప్రకారం కాకున్నా అందులో సగభాగం కూడా ఇవ్వలేదన్నారు. అందుకే బీసీలు రాజకీయ పోరాటాలకు నడుం బిగించాలన్నారు.

అదే దందా..!



పెన్నా నదిలో నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్లు



- మూడునెలల్లో అసాంఘికాలు రూపుమాపుతానన్న రాచమల్లు
- ఐదు నెలలైనా ఆగని ఇసుక అక్రమ రవాణా
- ఇసుక రీచ్‌లకు అనుమతి లేకున్నా..
- మూడేళ్లుగా పెన్నాను కొల్లగొడుతున్న వైనం
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో సాగుతున్న దందా
- మూడేళ్లలో వందల రూ.కోట్లు గడించిన ఇసుక మాఫియా
- అడ్డుకునే ప్రయత్నం చేసిన మహిళా ఎస్‌ఐపై దాడి
- రాత్రి పగలు పెన్నానది నుంచి ట్రాక్టర్లతో రవాణా
- నామమాత్రపు కేసులతో చేతులు దులుపుకుంటున్న పోలీసులు



రామేశ్వరం బైపాస్ రోడ్డులో ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక



రామేశ్వరం వాటర్ వర్క్స్ రైల్వే బ్రిడ్జి కింద నుంచి తరలిపోతున్న ఇసుక ట్రాక్టర్లు



దొరసానిపల్లెలో రాత్రివేళ అక్రమంగా తరలిపోతున్న ఇసుక

ప్రొద్దుటూరు, మార్చి 11: "ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యక్రమాలన్నింటినీ నేనే నడుపుతున్నానని ప్రతిపక్ష టీడీపీ నేతలు నాపై విషప్రచారం చేస్తున్నారు. వాటిని రూపు మాపడానికి నేనే స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా" అని గత ఏడాది అక్టోబరు 14న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి వైసీపీ నాయకులతో వెళ్లి ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌కు వినతిపత్రం ఇచ్చారు. అసాంఘిక కార్యాక్రమాలన్నీ మూడు నెలల్లో రూపుమాపకపోతే తానే స్వయంగా ఉద్యమిస్తానని ఎమ్మెల్యే ఆ రోజు మీడియా ఎదుట ప్రకటించారు. ఇందుకోసం పోలీసులకు సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. ఇప్పటికి ఐదు నెలలు కావస్తున్నా ప్రొద్దుటూరులో అసాంఘిక నేరాలు ఏవీ అదుపులోకి రాలేదు. ఇసుక అక్రమ రవాణాకు సైతం ఎక్కడా అడ్డుకట్ట వేయకపోగా అప్పటి నుంచి విచ్చల విడిగా ట్రాక్టర్లలో, లారీల్లో ఇసుక ఎల్లలు దాటుతోంది.

మూడేళ్లుగా ఇసుక రీచ్ లేకున్నా..

ప్రొద్దుటూరు మండల పరిధిలోని పెన్నానదిలో మూడేళ్లుగా ఎక్కడా ఇసుక రీచ్‌లకు భూగర్భ గనుల శాఖ అనుమతులు ఇవ్వలేదు. అయినా ఇక్కడ అధికార పార్టీ నేతల కనుసన్నల్లో పెన్నానది నుంచి ఇసుక అక్రమరవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇందులో అధికారపార్టీ ముఖ్య నాయకుల దగ్గరి నుంచి కార్యకర్తలు, డ్రైవర్లు, ప్రైవేటు గన్‌మేన్‌లు, అనుచరులు, పార్టీ సానుభూతిపరులు ఉన్నారు. 2020 డిసెంబరు 29న ప్రొద్దుటూరులో అధికార పార్టీ నేతల ఇసుక దందాను ప్రశ్నించిన టీడీపీ యువ నాయకుడు నందం సుబ్బయ్యను నరికి చంపిన కేసులో నిందితులుగా ఉన్నవారు నేరుగా ఈ దందాను ముందుండి నడిపిస్తున్నారు. ఇందువల్ల అక్కడికి వెళ్లి పోలీసులు ట్రాక్టర్లును సీజ్‌చేసే పరిస్థితిలేదు. ఇటీవల ఒన్‌టౌన్ మహిళా ఎస్‌ఐ రాత్రి పూట గస్తీకి వెళ్లి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు ఆమెపై రాళ్లదాడి చేశారు. దాడి చేసింది ఎవ్వరో తెలిసినా పోలీసులు వారిపై ఇప్పటి దాకా కేసు నమోదు చేయలేదు. దీన్నిబట్టి ఈ ఇసుక మాఫియా వెనుక ఉన్న ఆ బలమైన వ్యక్తులెవ్వరో స్పష్టమవుతోంది.

ఇసుక మాఫియాకు ప్రైవేటు నిఘా

ప్రొద్దుటూరు మండల పరిధిలో పడమర దిక్కున దాదాపు 20 కి.మీ పరిధిలో పెన్నానది ఉంది. ఈ నదీ తీరం వెంబడి ప్రొద్దుటూరు పట్టణంతో పాటు పలు గ్రామాలు ఉన్నాయి. ఇక్కడి గ్రామాల్లో వ్యవసాయానికి, తాగునీటికి పెన్నా నీళ్లే ఆధారం. అలాంటి పెన్నానది నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా పెద్ద ఎత్తున సాగుతోంది. ఇందుకోసం ఇసుక మాఫియా ప్రైవేటు నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది. నదిలో తవ్వకాల వద్ద ప్రత్యేక నిఘా టీం ఉంటుంది. వీరు అటువైపు ఎవ్వరు వచ్చినా నదిలో తవ్వకాలు జరిపే ట్రాక్టర్ల వారికి సమాచారం ఇస్తారు. నదినుంచి ఇసుకతో ట్రాక్టర్ బయలుదేరిన తరువాత వీరు మోటారు బైకుల్లో పైలెట్లుగా ముందుగా వెళతారు. ఎక్కడన్నా వీరిని అడ్డుకుంటే తిరగబడతారు. ఫొటోలు తీస్తే సెల్‌ఫోన్లు గుంజుకుని దాడిచేస్తారు. పకడ్బందీగా వీరి ఇసుక దందా మూడు ట్రాక్టర్లు ఆరు లారీలు అన్నట్టుగా సాగుతోంది.

ట్రాక్టర్ ఇసుక రూ.5 వేల నుంచి రూ.6వేలు

ప్రతి రోజు ప్రొద్దుటూరు మండలంలోని అన్ని గ్రామాలను కలిపి దాదాపు 200 ట్రాక్టర్ల మేర ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నట్లు అంచనా. ట్రాక్టర్ ఇసుకకు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు రాత్రి పగలు కలిపి రోజుకు 20 ట్రిప్పులు తిరుగుతుంది. అంటే ఒక్క ట్రాక్టర్ ద్వారానే రోజుకు ఇసుక అక్రమ రవాణాతో లక్షకు పైగా సంపాదిస్తున్నారు. దీంతో ఒక్కొక్కరు రెండు నుంచి నాలుగు ట్రాక్టర్లు పెట్టుకుని తోలుతున్నారు. అందులో ముఖ్యంగా రామేశ్వరం, ఈశ్వరరెడ్డి నగర్, పెన్నానగర్, పెద్దశెట్టి పల్లె, కొత్తపేట, రామాపురం, దొరసానిపల్లె, చౌటపల్లెలో అధికార పార్టీ ముఖ్యనేతలు వారి అనుచరులు డ్రైవర్లు ఈదందా సాగిస్తున్నారు. నంగనూరుపల్లె, తాళ్లమాపురం, కల్లూరులలో మండలస్థాయి అధికారపార్టీ నేతలు ఉన్నారు. ఇందులో నంగనూరుపల్లె, కల్లూరు గ్రామాలకు చెందిన అధికార పార్టీ ముఖ్యనేతలకు ఈ దందాలో భాగస్వామ్యం ఉన్నట్ల ప్రచారం ఉంది.

స్టేషన్లకు మామూళ్లు

ప్రతి పోలీస్‌స్టేషనుకు అధికారిని బట్టి ఇసుకమాఫియా ప్యాకేజీ ఫిక్స్ చేసినట్లు చెబుతారు. ముఖ్యంగా ఈ దందా జరిగే రూరల్, ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్లకు మామూళ్లు ఎక్కువగా అందుతున్నాయని సమాచారం. దీనికి తోడు బ్లూకోల్ట్స్ బ్యాచ్‌లకు ప్రత్యేకంగా ట్రాక్టర్ల ట్రిప్పులను బట్టి తీసుకుంటున్నట్లు బహిరంగా ప్రచారం సాగుతోంది. కాగా.. గతంలో ఇక్కడ పనిచేసిన కొందరు ఎస్‌ఈబీ అధికారులకు సైతం స్టేషన్ మామూళ్లు అందేవని ప్రచారం ఉంది.

ఇసుక అక్రమరవాణాపై దాడులు చేస్తున్నాం..

ఇసుక అక్రమ రవాణాపై దాడులు చేస్తూనే ఉన్నాం. లా అండ్ ఆర్డర్‌తో పాటు ఈ ఆక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టలేకపోతున్నాం. దానికి తోడు సరిపడ పోలీసు సిబ్బందిలేరు. అయినా ఈ ఏడాది జనవరిలో 22 కేసులు, ఫిబ్రవరిలో 9 కేసులు, మార్చిలో 9వతేది వరకు 7 కేసులు కట్టాం. అన్ని శాఖలు సమన్వయంగా పనిచేస్తేనే అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టగలం. ఇసుక మాఫియా నుంచి స్టేషన్ మామూళ్లు అనేవి అసత్య ప్రచారం.

- రమణారెడ్డి, ప్రొద్దుటూరు రూరల్ సీఐ

జరిమానాలు విధిస్తున్నాం..

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)లో సిబ్బంది తక్కువ పనిఎక్కువ. ముఖ్యంగా అక్రమ మద్యం, గంజాయి గుట్కాపై దృష్టి పెడుతున్నాం. ఇక్కడ ఇసుక పెద్ద ఎత్తున అక్రమ రవాణ సాగుతోంది. దీన్ని అన్ని శాఖల సమన్వయంతోనే అరికట్టడం సాధ్యం. మా పరిధిలో పట్టుకుని జరిమానాలు విధిస్తున్నాం. కేసులు పెట్టే అధికారం మాకు లేదు.

- మహేశ్‌కుమార్, సెబ్ సీఐ

వరికి నీరు అందేనా...?



ఈ రైతు పేరు సోమశెట్టి తిరుమలయ్య. దమ్మనపల్లెకు చెందిన ఈయన తన కుమారులతో కలిసి మొత్తం పది ఎకరాల్లో వరి సాగు చేశాడు. చెరువులో నీరు తగ్గిపోవడంతో రెండు ఎకరాల్లో మాత్రమే ఫలసాయం వచ్చే పరిస్థితి ఉందని.. మరో 8 ఎకరాలకు పూర్తిస్థాయిలో నీళ్లు అందుతాయో లేదోనన్న సందేహం వ్యక్తం చేశారు.

- చెరువులో అడుగంటిన నీళ్లు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- వ్యవసాయ బోర్లు ఉన్న రైతులను ఆశ్రయించి..
- తడికి రూ.వెయ్యి వంతున చెల్లిస్తున్న వైనం

పోరుమామిళ్ల, మార్చి 11: వరి ధాన్యానికి మంచి ధరలు ఉన్నాయి... చెరువులో నీరు సమృద్ధిగా ఉంది.. వరి పైరు సాగు చేసుకుంటే... కష్టాల నుంచి గట్టెక్కవచ్చని అప్పులు చేసి పంట సాగు చేశారు కొందరు రైతులు. ప్రస్తుతం పంట కొంత మేర కోత దశలో ఉండగా.. మరికొంత మరో రెండు నెలలకు పంట చేతికి వచ్చే పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో చెరువులో ఉన్న నీరు అడుగంటి పోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పంట చేతికి అందుతుందా లేదా సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఈ ఏడాది రబీ సీజన్‌లో పోరుమామిళ్ల చెరువు కింద దమ్మనపల్లె, కట్టకిందపల్లె, సుంకేసులపల్లె, మార్కాపురం, మల్లకతవ కింద భాగాన దాదాపు వెయ్యి ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో కొంత మేర పైరు కోత దశకు చేరుకుంది. 400 ఎకరాలలో మరో రెండు నెలలు నీరందించాల్సి ఉంది. ఈ దశలో పోరుమామిళ్ల చెరువు నీటిని రంగసముద్రం, రెడ్డికొట్టాలకు మళ్లించడంతో నీటి మట్టం బాగా తగ్గిపోయింది. దీంతో రైతుల్లో అలజడి మొదలైంది. ఇప్పటికే కొందరు చెరువులోని గుంతల్లో ఉన్న నీటిని ఇంజన్లు పెట్టుకుని పొలాలకు మళ్లించుకుంటున్నారు. మరికొందరు చెరువులో ఊట నీరు రాకపోతుందా.. అందరి పొలాలతో పాటు మా పొలాలకు నీళ్లు పారకపోతాయా అన్న ఆశతో ఉన్నారు. అయితే మరికొందరు రైతులు వరిపైరును కాపాడుకునేందుకు వ్యవసాయ బోర్లు ఉన్న రైతులను ఆశ్రయించి నీటి తడులు అందిస్తున్నారు. ఎకరాకు ఒక్కో తడికి రూ.వెయ్యి చొప్పున చెల్లించి నీళ్లు కట్టుకుంటున్నారు. ఇక ఇప్పటికే ఎకరాకు దాదాపు రూ.25వేల వరకు పెట్టుబడి పెటామని చెబుతున్నారు. ఇప్పుడు ఒక్కో ఎకరాకు తడికి వెయ్యి వంతున చెల్లించాల్సి ఉంటుందని.. అది కూడా వారి కనికరిస్తే తప్ప తమపొలాలకు నీరందని పరిస్థితి ఉందని వాపోతున్నారు. పైరు చేతికి వచ్చేంత వరకు అధికారులు కానీ నాయకులు కానీ సహకరించి నీరు విడుదల చేస్తే తమ పంటను కాపాడుకోవడానికి అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయమై వ్యవసాయాధికారి వరహరికుమార్‌ను వివరణ కోరగా.. వరి సాగు చేసిన రైతులకు చెరువు నీరు సరిపోతుందని, ఖరీఫ్‌కు మాత్రం చెప్పలేమన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ రబీలో వరికి కావలసిన నీరు లభిస్తుందన్నారు.



పోరుమామిళ్ల చెరువు కింద సాగులో ఉన్న వరి





పోరుమామిళ్ల చెరువులో చిన్నతూము వద్ద అడుగంటిన జలాలు, చెరువులోని గుంతల నుంచి మోటర్ల ద్వారా నీరు తోడుతున్న దృశ్యం

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 11 : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని.. ఏప్రిల్ 11 వరకు గడువు ఉంటుందన్నారు. 36 మండలాల పరిధిలో 17 కేజీబీవీల్లో 1360 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 17 కేజీబీవీల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 6వతరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం నూతన ప్రవేశాలతో పాటు 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. జిల్లా పునర్విభజన అనంతరం 36 మండలాల్లో ఉన్న 17 కేజీబీవీల్లో 6వ తరగతిలో 680, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 680, 7వ తరగతిలో 19, 8లో 15, 9లో 24 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. బడి బయట పిల్లలు, బడి మానేసిన పిల్లలు, అనాథలు, దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ, ఓబీసీ మైనార్టీ నిరుపేదల కుటుంబాలకు చెందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్థిని, తల్లి, తండ్రి ఆధార్‌కార్డు, తల్లిదండ్రులు లేని యెడల సంరక్షకుల ఆధార్‌కార్డు, విద్యార్థికి సంబంధించిన మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, మొబైల్ నెంబరు ఉండాలని తెలిపారు. కేజీబీవీల్లో బైపీసీకి సంబంధించి బి.కోడూరు, బి.మఠం, చక్రాయపేట, ఖాజీపేట, మైదుకూరు, పెండ్లిమర్రి, వల్లూరు, వేముల కేజీబీవీల్లో ఉన్నట్లు తెలిపారు. అలాగే ఎంపీసీ గ్రూపులకు సంబంధించి అట్లూరు, దువ్వూరు, చాపాడు, పోరుమామిళ్ల, పెద్దమడియం, కాశినాయన, సింహాద్రిపురంలో ఉన్నాయని హెచ్ఈసీ గ్రూపు కలసపాడు, ఎంపీహెచ్‌డబ్ల్యు జమ్మలమడుగులో ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లాసెమిస్టరు పరీక్షలు ప్రారంభం



పరీక్షలను పర్యవేక్షిస్తున్న వైస్‌చాన్సలర్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 11: వైవీయూ అనుబంధ న్యాయ కళాశాల విద్యార్థుల సెమిస్టరు పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడేళ్ల లా కోర్సు ఐదో సెమిస్టరు పరీక్షలకు 242 మంది హాజరు కాగా 23 మంది గైర్హాజరయ్యారు. ఐదేళ్ల లా 9వ సెమిస్టరు పరీక్షలకు 209 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఐదేళ్ల ఐదో సెమిస్టరు పరీక్షకు 99 మంది హాజరు కాగా 17 మంది పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షల సూపరింటెండెంట్ ప్రొఫెసరు షావల్లిఖాన్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పరీక్షలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. పరీక్షల తనిఖీలో వైస్‌చాన్సలర్‌తో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాదరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఎన్.ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.

స్పందన అర్జీలపై దృష్టి పెట్టండి

రాయచోటిటౌన్, మార్చి11: స్పందన కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్ కమల్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో స్పందన (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 29 మంది ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని రాతపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు.

అగ్నిప్రమాదంలో మామిడి, చీనీ చెట్లు దగ్ధం



కాలిపోయిన చెట్లను చూపి ఆవేదన చెందుతున్న రైతు లక్ష్మీదేవి

పోరుమామిళ్ల, మార్చి 11: మండలంలోని పుల్లీడు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మామిడి, చీనీ చెట్లు దగ్ధం అయ్యాయి. పుల్లీడు గ్రామానికి చెందిన అవటాల లక్ష్మీదేవి, ప్రశాంతి అనే రైతులు గ్రామ సమీపంలో నాలుగు సంవత్సరాల క్రితం మూడున్నర ఎకరాల్లో నిమ్మ, మామిడి, టెంకాయ మొక్కలు సాగు చేశారు. సోమవారం జరిగిన ప్రమాదంలో చెట్లతో పాటు లిఫ్ట్ ఇరిగేషన్ పైపులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ సంఘటనలో దాదాపు లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని ఆ మహిళా రైతులు వాపోయారు. విషయాన్ని హార్టికల్చర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కాగా, సోమవారం సీఎం సమావేశం ఉండడంతో అగ్నిమాపక కేంద్రం అధికారులు కూడా అందుబాటులో లేనట్లు తెలిసింది.

విషద్రావణం తాగి వ్యక్తి ఆత్మహత్య



ప్రసన్న బాలాజీ మృతదేహం

ముద్దనూరు మార్చి11: స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం ప్రసన్న బాలాజీ (37) అనే వ్యక్తి విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎర్రగుంట్ల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజారాం రెడ్డి తెలిపారు. మచిలీపట్నంకు చెందిన ప్రసన్న బాలాజీ ముద్దనూరులోని పాత వీధిలో నివాసం ఉంటున్నారు. అతని భార్య స్థానిక ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. బాలాజీ ఇక్కడే ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబంలో మనస్పర్థల కారణంగా విషద్రావణం తాగి రైల్వేస్టేషన్‌లో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రాజాశరత్ మృతి



రాజాశరత్ (ఫైల్)

రాజంపేట టౌన్, మార్చి 11: రాజంపేట వాసవీ సహృదయ సేవా సమితి అధ్యక్షుడు రాజాశరత్(41) ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకెళితే.. రాజాశరత్ చాలా సంవత్సరాలుగా పేదలకు, అనాథలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నాడు. అందులో భాగంగా ఓ బీసీ విద్యార్థినిని హాస్టల్‌లో చేర్చేందుకు పుల్లంపేట నుంచి రాజంపేటకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. భువనగిరిపల్లె ఆర్చి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ లైటింగ్‌కు పక్కన ఆగడంతో వెనుకవైపు వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంలోని ఇరువురు కింద పడగా రాజాశరత్‌కు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యార్థినీ గాయపడటంతో కడప రిమ్స్‌కు తరలించారు. రాజాశరత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజాశరత్ మృతి విషయం తెలుసుకున్న సేవా సంఘాలు, రాజకీయ నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి ఆయన మృతికి నివాళులర్పించారు. రాజాశరత్‌కి భార్య, నాలుగు నెలల కుమారుడు ఉన్నారు.

రాజంపేట పట్టణంలో చోరీ

- రూ. 1.7 లక్షల నగదు, 10 గ్రాముల బంగారు అపహరణ

రాజంపేట టౌన్, మార్చి 11 : రాజంపేట పట్టణంలోని ఎర్రబల్లి ప్రాంతం రామచంద్రపురం సమీపంలోని ఓ ఇంటిలో చోరీ జరిగినట్లు రాజంపేట రూరల్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళితే...
రామచంద్రాపురం సమీపం లో నివాసం ఉంటున్న సయ్యద్ ఫాతిమా ఆదివారం రాత్రి కుటుంబ సభ్యు లతో కలసి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా... దొంగలు ఇంటికి చుట్టూ ఉన్న గ్రిల్స్‌ను వంచి ప్రధాన ద్వారా న్ని తొలిచి ఉంచారు. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.1,70,000ల నగదు, వంద గ్రాముల బంగారు చోరీ చేసినట్లు గుర్తించా రు. ఈమేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజంపేట రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్‌టీమ్ ద్వారా పలు ఆధారాలను సేకరించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెద్దచెప్పలి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు

కమలాపురం రూరల్, మార్చి 11: పెద్దచెప్పలి ప్రాంతంలో జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రిషికేశవరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివా రం పెద్దచెప్పలి ప్రాంతంలో టీడీపీలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో 40 మందిపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. ఇందులో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డితో పాటు ఆయన వర్గంలోని 20 మందిపై, టీడీపీ మాజీ కార్యదర్శి కాశీభట్ల సత్యసాయినాథశర్మతో పాటు ఆయన వర్గంలో 20మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పూలంగిసేవలో పులకించిన వీరభద్రుడు



పూలంగిసేవ కార్యక్రమానికి హాజరైన భక్తజనం, పూలంగిసేవలో పులకిస్తున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటిటౌన్, మార్చి11: దక్షిణకాశీగా పేరుగాంచిన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం 7వ రోజు ఉదయం ప్రమధగణ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయమ్మ, మున్సిపల్ వైస్ చైర్మెన్ దశరథరామిరెడ్డి, ఆలయ ఈవో డీవీ రమణాలరెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేద మంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై పట్టణ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ వారిచే నిర్వహించిన చెక్కభజన భక్తులను అలరించింది.
అలాగే భద్రకాళీ సమేత వీరభద్రుడు పూలంగిసేవలో పులకించాడు. అలాగే నైనానందకరంగా నందివాహనంపై భద్ర కాళీ సమేత వీరభద్రుడు పట్టణ పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి భజన మండలి తుమ్మల హరినాధ ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

దుంగలు స్వాధీనం.. స్మగ్లర్ అరెస్టు



స్వాధీనం చేసుకున్న దుంగలు, స్మగ్లర్‌ను చూపుతున్న అటవీశాఖాధికారులు

రైల్వేకోడూరు, మార్చి 11: రైల్వేకోడూరు రేంజి పరిధిలో గాదెల అటవీ ప్రాంతంలో సోమవారం ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు రేంజి ఇన్‌చార్జ్ రేంజర్ వై.రఘునాథరెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు గాదెల బీటు శేషాచల అడవిలో బోనిశల ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తుండగా దాడులు చేసి తిరుణ్ణామలై జిల్లాకు చెందిన ఆర్.వెంకటేశం అనే తమిళ స్మగ్లర్‌ను అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 6 దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా గంగమ్మ జాతర ప్రారంభం



పూజలు అందుకుంటున్న గంగమ్మ తల్లి

సీకేదిన్నె, మార్చి 11: చింతకొమ్మదిన్నె గంగమ్మ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయంలో అన్ని వసతులతో పాటు భద్రతా ఏర్పాట్లు కూడా కట్టుదిట్టం చేశారు. జాతర సందర్భంగా భక్తులకు భారీగా అన్నదానం నిర్వహించారు. వృషభరాజములకు బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. కోలాటం కనువిందు చేసిం ది. సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రికి కల్యాణం, గ్రామోత్స వం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ, చైర్మన్లు తెలిపారు. మంగళవారం రెండో రోజు తిరుణాల జరుగుతుందన్నారు. భక్తులకు దాతలు మజ్జిగ, మంచినీరు, పానకం అందించారు.

ప్రజా సమస్యలపరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : జేసీ

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 11: జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన ప్రజా సమస్యల పరిష్కా రంలో నిర్లక్ష్యం చూపకుండా అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జేసీతో పాటు డీఆర్‌వో సత్యనారాయణ ప్రజల నుంచి ఫిర్యా దులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు.
నిర్ణీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా సంతృప్తిస్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు.

సీఎం రాకతో.. ఎన్ని కష్టాలో..!

- కొత్త ఆసుపత్రి ప్రారంభోత్సవానికి వెళ్లిన డాక్టర్లు
- వైద్యులు లేక రోగుల విలవిల



పులివెందుల ఏరియా ఆసుపత్రిలో మూతపడ్డ డాక్టర్ల గదులు

పులివెందుల రూరల్, మార్చి 11: పులివెందుల ఏరియా ఆసుపత్రిలో సోమవారం డాక్టర్లు లేక రోగులు విలవిల్లాడారు. వచ్చిన రోగులు కనీసం మాత్రలు, ఇంజక్షన్లు, బీపీ చెకప్‌కు కూడా నోచుకోలేదు. పులివెందులలో నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాల, వైఎస్సార్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌ను సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పారంభోత్సవానికి ఆసుపత్రిలోని డాక్టర్లు అందరూ వెళ్లిపోయారు. దీంతో డాక్టర్ల గదులు మూతపడ్డాయి. ఒకరిద్దరు నర్సులు మాత్రమే ఉండగా వారు కూడా ఖాళీగా కూర్చొని వచ్చిన రోగులకు తాపీగా సమాధానం చెప్పి పంపారు. అక్కడున్న నర్సులను కనీసం బీపీ అయినా చెకప్ చేయమ్మా అని ఓ వృద్ధురాలు అడగ్గా డాక్టర్లు రాస్తేనే చేస్తామంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చింది. దీంతో చేసేది లేక ఆ వృద్ధురాలు వెనుదిరిగిపోయింది. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకునే స్థోమత లేక ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ఒక్క డాక్టర్ కూడా లేకపోవడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. గర్భవతులు, పిల్లలు, యువకులు, వృద్ధులు వ్యయప్రయాసాలకు ఓర్చి ఆసుపత్రికి రాగా అక్కడ డాక్టర్లు లేక వెనుదిరిగిపోయారు. వంద పడకల ఆసుపత్రిలో ఒక్క డాక్టర్‌ను అయినా ఉంచి రోగులను చూడాలన్న కనీస ఆలోచన కూడా ఉన్నతాధికారులు చేయకపోవడం పేద ప్రజలపై ఎంతటి నిర్లక్ష్యం చూపుతున్నారో అర్థమవుతోంది.



డాక్టర్లు లేకపోవడంతో ఆసుపత్రి నుంచి వెనుదిరుగుతున్న రోగులు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

'మెసెంజర్స్ సమస్యలు పరిష్కరించాలి'

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 11 : సమగ్రశిక్ష అభియాన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మెసెంజర్ల సమస్యలను పరిష్కరించాలని మెసెంజర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంద్యాల నాగభూషణం, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చిన్నయ్య డిమాండ్ చేశారు. సోమవారం కడప ఎంపీ వైఎస్ అవినాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగు వేతనాలు చెల్లించాలని కోరారు. అలాగే బోర్డులో ప్రాజెక్టు అప్రూవల్ చేయాలన్నారు. మెసెంజర్లకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. అలాగే మెసెంజర్లను ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో మెసెంజర్ల సంఘం ప్రతినిధులు, ఎమ్మెల్సీ రాంచంద్రారెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలనను సాగనంపుదాం

● టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 11 : సైకో జగన్‌మోహన్‌రెడ్డి పాలనను సాగనంపుదాం అని కడప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి అన్నారు. కడప నగరం 10వ డివిజన్‌లో బాబు షూర్యిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమం మాటున అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నదన్నారు. మళ్లీ జగన్‌ను గెలిపిస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. సైకో పాలనను ప్రజలందరూ కలిసికట్టుగా సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమణ, శివకొండారెడ్డి, రవి, మాసాపేట శివ, అర్జున్, అప్సర్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

కడప నగరంలోని 14, 45, 27 డివిజన్లలో భారీ సంఖ్యలో టీడీపీలోకి చేరారు. వారికి టీడీపీ కండువా వేసి మాధవీరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జావీదు, సాగర్, శేఖర్, ఆలీ, మహబూబ్‌బాషాతో పాటు 14, 45 డివిజన్లలో ఇలియాస్, బత్తల రమణ, నరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవీరెడ్డి

నేడు తోళ్లగంగనపల్లెలో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

వల్లూరు, మార్చి 11 : టీడీపీ చేపడుతున్న మీ భవిష్యత్తుకు మేం గ్యారంటీ పథకాన్ని మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె గ్రామంలో నేడు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, ఇందుకు ప్రతి కార్యకర్తా కష్టపడి పనిచేయాలని నాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈనెల 12న మధ్యాహ్నం 3 గంటలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తోళ్లగంగనపల్లెకు తరలిరావాలని ఆయన పేర్కొన్నారు.

మొయిళ్లచెరువులో కార్డన్ సెర్చ్



నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

వీరపునాయునిపల్లె, మార్చి 11: మండలంలోని ఫ్యాక్షన్ మరియు క్రిటికల్ గ్రామమైన మొయిళ్లచెరువు గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్‌ను పోలీసులు నిర్వహించారు. సోమవారం జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశానుసారం రానున్న ఎన్నికల సందర్భంగా కమలాపురం సీఐ సూచనలతో ఎస్‌ఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది, ఎస్ఎస్‌బీ పారామిలిటరీ సిబ్బంది ఉదయం 6గంటల ప్రాంతంలో ఇళ్లను పరిశీలించారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లలో తనిఖీలు చేశారు. అలాగే ఉదయం 9గంటల నుంచి ఫ్యాక్షన్, క్రిటికల్ గ్రామమైన పాయసంపల్లెలో నాకాబందీ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం

చక్రాయపేట, మార్చి 11: మండల కేంద్రమైన చక్రాయపేటలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను సోమవారం ప్రారంభించారు. వైసీపీ మండల అధ్యక్షుడు వైఎస్ కొండారెడ్డి ప్రారంభించారు.

అలాగే బీసీ హాస్టల్‌ను ప్రారంభించారు. దాదాపు రూ.6కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శివప్రసాద్ రెడ్డి, కాంట్రాక్టర్ చినపల్లెగారి హేమసుందర్‌రెడ్డి, ఎంపీపీ మాధవి బాలకృష్ణ, సర్పంచు, ఎంపీటీసీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగదు చోరీ

పులివెందుల టౌన్, మార్చి 11: పులివెందుల పట్టణంలో సోమవారం నగదు చోరీకి గురైంది. దస్తగిరి వల్లి అనే వ్యక్తి పులివెందులలోని కెనెరా బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.7.50లక్షలు తీసుకున్నాడు. ఆ నగదును బైకు వెనుక బ్యాగులో ఉంచి బైకు నడుపుతున్న సమయంలో వెనక నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆ బ్యాగులో నుంచి డబ్బు లాక్కొని పారిపోయాడు. అతనితో పాటు మరో ఇద్దరు కూడా బైకులో వచ్చి ముగ్గురు కలిసి వెళ్లిపోయారు.

పరిశోధన ప్రాజెక్టులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సలీంబాషా

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 11 : అధ్యాపకులు పరిశోధన ప్రాజెక్టులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా తెలిపారు. సోమవారం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఎన్ఆర్‌సీ ఆధ్వర్యంలో నాన్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

కళాశాల విద్య ఓఎస్డీ డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తెలియజేసిన అంశాలను శ్రద్ధగా ఆలకించి తమ విద్యాబోధనలో ఉపయోగపడే విధంగా రూపొందించుకోవాలన్నారు. నూతన విద్యావిధానానికి అనుగుణంగా విద్యను అందించాలన్నారు. ఎన్ఆర్‌సీ కో ఆర్డినేటరు డాక్టర్ రమణయ్య, రిసోర్స్ పర్సన్లు రవిశేఖర్, డాక్టర్‌సావిత్రి, డాక్టర్ సునీత, డాక్టర్ గౌస్‌బాషా, జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి జంతు శాస్త్ర అధ్యాపకులు బయోటెక్నాలజీ అధ్యాపకులు, బయో కెమిస్ట్రీ అధ్యాపకులు హాజరయ్యారు.

ఇచ్చిన హామీలు అమలు చేయని జగన్

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి11:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభలో జగన్ చెప్పినవన్నీ అబద్ధాలేనన్నారు. 85 శాతం హామీలు అమలు చేయకుండా మాట తప్పారన్నారు. సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం బడ్జెట్‌లో 15 శాతం ఖర్చు చేయగా చంద్రబాబు 19 శాతం ఖర్చు చేశారన్నారు. బాబాయి గొడ్డలి వేటు పాపంతో పులివెందులలో ఎలా గెలుస్తావో చూసుకో అని సవాల్ చేశారు. ప్రజావిశ్వాసం కోల్పోయినందునే సభకు నిండా లక్ష మంది కూడా రాలేదన్నారు. మద్యనిషేధం చేశాకే ఓటు అడుగుతానన్న జగన్ మాట తప్పి మడమ తిప్పాడని, ఓటు అడిగే హక్కు కోల్పోయారన్నారు. 3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, అధికారంలోకి వచ్చిన వారం లోపే సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి మాట తప్పారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచనన్న హామీకి విరుద్ధంగా 9 సార్లు పెంచి రూ.64 వేల కోట్లు కరెంటు చార్జీల భారం ప్రజలపై మోపింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇసుక సరఫరాపై మాట తప్పి ఉచిత ఇసుక రద్దు చేసి 50వేల కోట్ల కుంభకోణం చేశారన్నారు. 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి పోగోట్టారన్నారు. అలాగే ఇద్దరు బిడ్డలకు అమ్మఒడి హామీపై కూడా మాట తప్పారన్నారు. రైతు భరోసాకు 12,500 హామీపై మాట తప్పి రాష్ట్ర నిధుల నుంచి రూ.7500 మాత్రమే ఇస్తున్నారన్నారు. పెట్రోలు, డీజలు, రేట్లు తగ్గిస్తానన్న హామీని కూడా నిలబెట్టుకోలేదన్నారు. 25 లక్షల పక్కా ఇళ్లు ఉచితంగా నిర్మిస్తానన్న హామీ ఏమైందన్నారు. ఇంటి నిర్మాణాల పేరుతో పేదలను అప్పులపాలు చేశాడని, సెంటు పట్టా పేరుతో 7వేల కోట్లు కుంభకోణం చేశాడన్నారు. ఇలా 85 శాతం హామీలు అమలు చేయకుండా మాట తప్పి మడమ తిప్పాడని విమర్శించారు. 99 శాతం హామీలు అమలు చేశానని పచ్చి అబద్ధాలు చెబుతున్నారన్నారు. ధరలు, పన్నులు, చార్జీలు ఇలా అన్నీ పెంచేసేరన్నారు. సబ్‌ప్లాన్ నిధులు రూ.లక్ష కోట్లు దారి మళ్లించారని పేర్కొన్నారు. ప్రశ్నించిన దళిత బడుగు, బలహీన వర్గాల వారిపై హత్యలు చేశారని ఆరోపించారు. ఈ నేరపాలనలో ఐదు కోట్ల మంది బాధితులయ్యారన్నారు. ప్రజలను మోసం చేయడానికే మేదర మెట్లకు ఆరు జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో వంద కోట్లు ఖర్చు చేసి జనాలను తరలించే ప్రయత్నం చేశారన్నారు. అయినా సభ వెలవెలబోయిందని అందుకే మీడియాపై అంక్షలు పెట్టారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలి: సీపీఎం



ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కడప (నాగరాజుపేట), మార్చి 11 : ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని సీపీయం జిల్లా కార్యదర్శి చంద్రశేకర్ అన్నారు. సోమవారం నగరంలోని ఏడురోడ్ల కూడలిలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే ఎన్నికల బాండ్ల వివరాలను సుప్రీం తీర్పు ప్రకారం బహిర్గతం చేయాలన్నారు. ప్రభత్వరంగ బ్యాంకు ఎస్‌బీఐ సిబ్బందిని ఆదేశించాలని 80 మంది రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఎన్నికల సంఘాన్ని కోరారరన్నరు. ఎస్‌బీఐకి బహిరంగ లేఖ కూడా రాయడం జరి గిందని వారు తెలిపారన్నారు. ఈ బాండ్ల సమాచారం అంతా అందించేంత వరకు సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ప్రకటించరాదని వారు ఆ లేఖ లో రాశారన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన గడువు ఎస్‌బీఐ ఉల్లంఘించిన నేపథ్యంలో ఈ లేఖ వెలువడిందన్నారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించి మార్చి 6 కల్లా ఈ వివరాలు ఎన్నికల సంఘానికి అందించాలని సుప్రీం ఆదేశించడంతో గడువు ముగియడానికి ఒక రోజు ముందే ఎన్నికల బాండ్లను రద్దు చేసి 17 రోజుల తరువాత ఎస్‌బీఐ జూన్ 30 వరకు తమకు గడువు కావాలని సుప్రీంకోర్టుకు దరఖాస్తు చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సీపీయం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, మనోహర్, జిల్లాకమిటి సభ్యులు శ్రీనివాసులరెడ్డి, దస్తగిరిరెడ్డి, కడప నగర కమిటి సభ్యులు రాజేంద్ర పాల్గొన్నారు.



వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా విద్యాబోధన సాగాలి

● డీఈఓ అనురాధ



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

చెన్నూరు, మార్చి 11:విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా విద్యాబోధన సాగాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.అనురాధ అన్నారు. సోమవారం చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలను డీఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. టోఫెల్ బోధన గురించి నాలుగో తరగతి విద్యార్థులను అడిగారు. ఎల్ఈపీ కార్యక్రమం, టీఏఆర్ఎల్ వాటి రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అభ్యసనాభివృద్ధికి సంబంధించి రికార్డులు, విద్యార్థుల నోట్‌బుక్కులను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం అదే ప్రాంతంలోని సోషల్ వెల్ఫేర్ ప్రైమరీ పాఠశాలను తనిఖీ చేశారు. ఎంఈఓ గంగిరెడ్డి, ఎంఈవో-2 సునీత, సీఆర్పీలు పాల్గొన్నారు.

18న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటు

కమలాపురం రూరల్, మార్చి 11 : స్థానిక సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో మార్చి 18 నుంచి హార్డ్ టెన్నిస్ టి 10 బాల్ క్రికెట్ టోర్నమెంటు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు సునీల్ సుందర్, సురేంద్రబాబు, దినకర్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ 30వేలు ఉంటుందన్నారు. ఎంట్రీ ఫీజు రూ.1200 కట్టి 17వ తేదీ సాయంత్రం లోపు తమ జట్లు నమోదు చేసుకోవాలన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై 14న నిరసనలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి తదితరులు

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 11 : ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 14న నిరసనలు చేపట్టనున్నట్లు వామపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, దస్తగిరిరెడ్డి, సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం కడప నగరంలోని చిలకలబావి వద్ద ఉన్న ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుపరచకుండా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ధ్వజమెత్తారు. ఒకవైపు పెట్రోలు, డీజలు, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసి ప్రజల నెత్తిన భారం వేయడమే కాకుండా వ్యవసాయ, పారిశ్రామికరంగాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈనెల 14న జరిగే నిరసన కార్యక్రమంలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దిమద్దిలేటి, ఏఐటీయూసీ కడప నగర ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన

తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాల్లో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించినదని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీత/హామీదార్లను కోరుతూ రుణగ్రహీత/హామీదార్లకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అయితే రుణగ్రహీత/హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు షెడ్యూల్‌లో ఆస్తిలో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు ఎటువంటి అవలంబన లేని ప్రాతిపదికన తేది: 22 మార్చి, 2024న మ.12.30గం. నుండి మ.3.30 గం.వరకు (ఇ-వేలం సమయం) ఇ- వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.
రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ ఖాతా నం	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీసు తేది	స్థూల బరువు	నికర బరువు
1	కడప (ఏపి)	xxxxxxxxxxxx4556	ఆది శంకర్	108095	17-ఏప్రిల్-23	16.600	16.000
2	ప్రొద్దుటూరు (ఏపి)	xxxxxxxxxxxx1126	కాత నిరంజన్ చంద్రమౌళి రెడ్డి	100500	25-ఫిబ్రవరి-24	44.600	29.600
3	ప్రొద్దుటూరు (ఏపి)	xxxxxxxxxxxx6812	గుర్రంపాటి విజయభాస్కర్ రెడ్డి	94046.9	25-అక్టోబర్-23	28.000	26.500

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్పు చేయు/భారాను తొలగించు హక్కు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ కలిగియున్నది. వేలం ఆన్‌లైన్‌లో https://gold.samil.in (ఆన్‌లైన్ విక్రయదారు వెబ్‌సైట్) మ.12.30 గం. నుండి మ.3.30 గం. (సమయం) వరకు నిర్వహించబడుతుంది. సవివరమైన నియమనిబంధనల కొరకు ఇవి ఇవ్వబడిన వెబ్‌సైట్ https://gold.samil.in (ఆన్‌లైన్ విక్రయదారు వెబ్‌సైట్)కు లాగాన్ చేయగలరు.
ప్రదేశం : కడప అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

అభివృద్ధి పనులను ప్రారంభించిన పాడా ఓఎస్డీ

వేంపల్లె, మార్చి 11: వేంపల్లెలో కోట్లాది రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన పలు అభివృద్ధి పనులను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. రూ.7.70కోట్లతో నిర్మించిన ఉర్దూ జూనియర్ కళాశాల, రోడ్డు భవనాల శాఖ నూతన గెస్ట్‌హౌస్, రైతు బజార్ తదితర అభివృద్ధి పనులను ఓఎస్డీ ప్రారంభించారు. శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ గాయత్రి, హజ్ కమిటీ సభ్యులు మునీర్, ఇంజనీరింగ్ అధికారులు, తదితర నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

చెన్నూరు, మార్చి 11 : ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చని ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం చెన్నూరు రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు రెండురోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం ఆరోగ్యానికి మంచిది కాదని, సేంద్రియ సేద్యంతో ద్వారా పండించిన పంటలతో ఎంతో మేలు ఉందన్నారు. సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పకళ మాట్లాడుతూ పంటదిగుబడి, ఆరోగ్య విషయాల దృష్ట్యా రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని సూచించారు. రెండు మూడేళ్లలోనే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. వ్యవసాయాధికారి శ్రీదేవి మాట్లాడుతూ చిన్నపాటి మెలకువలు పాటిస్తే తెగుళ్లను నివారించవచ్చన్నారు. అడిషనల్ డీపీఎం (ఏపీసీఎంఎఫ్) వసంతకుమారి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఇందిరెడ్డి శివారెడ్డి, జీఎన్ భాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కరరెడ్డి, ఎరసాని మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



పుత్తాపై అక్రమ కేసు ఎత్తేయాలి: టీడీపీ

కమలాపురం రూరల్, మార్చి 11: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సంఘటనాస్థలంలో లేనప్పటికీ ఆయనపై కేసు నమోదు చేయడం దారుణమని, ఆ కేసును వెంటనే ఎత్తేయాలని కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా, టీడీపీ మండల కన్వీనరు రాఘవరెడ్డి తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం పెద్దచెప్పలిలో జరిగిన ఘటనలో పుత్తా లేకపోయినా అక్రమంగా 307 కేసు ఎలా పెడతారని ప్రశ్నించారు. ఆదివారం టీడీపీ కార్యకర్త భాస్కర్‌రెడ్డిని సాయినాథ్ శర్మ మనుషులు తీసుకెళ్లారని, ఇంతవరకు అతని జాడ తెలియదన్నారు. వీఎన్ పల్లె మండల కన్వీనరు భాస్కర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఆపలేరు

పెండ్లిమర్రి, మార్చి 11: అక్రమ అరెస్టులను ఆపలేరని టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, పార్టీ నేతలు ఆరవేటి చంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తప్పుడు కేసులు బనాయిస్తూ టీడీపీ కార్యకర్తను కొట్టి కిడ్నాప్ చేసి మళ్లీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి కుటుంబంపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. చీమలపెంట సర్పంచు ప్రతాప్‌రెడ్డి, పొలతల మాజీ చైర్మన్ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

'వైసీపీ నేతలు చెప్పినట్లే సాయి ఆటలాడుతున్నాడు'

చెన్నూరు, మార్చి 11 : టీడీపీ మాజీ నేత సాయినాథ్‌శర్మ వైసీపీ నేతలు చెప్పినట్లుగా ఆటలాడుతున్నాడని టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు షబ్బీర్‌హుసేన్, తెలుగు యువత జిల్లా కార్యదర్శి ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు.చెన్నూరు టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాయినాథశర్మనే కిడ్నాప్ చర్యలకు పాల్పడి ఆ సంఘటనలో లేని వారిపై అటెంప్ట్ మర్డర్ కేసు లు నమోదు చేయించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఇదంతా వైసీపీ నేతల కుట్రలో భాగమన్నారు.

చెన్నూరు పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, బీసీ సెల్ అధ్యక్షుడు ఆటోబాబు, మండల రైతు విభాగం అధ్యక్షుడు బాలక్రిష్ణరెడ్డి, నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు భవానీ ఆచారి, బలిజ సంఘం నేతలు పాల్గొన్నారు.

కేసులు వెంటనే తొలగించాలి

వల్లూరు, మార్చి 11: తమ పార్టీ నాయకుడు పుత్తా నరసింహారెడ్డి, నాయకులపై అక్రమంగా బనాయించిన కేసులు వెంటనే తొలగించాలని వల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, మండల నాయకులు రామసుబ్బారెడ్డి, గడికోట సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వల్లూరు టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

పుత్తాపై కేసు ఎత్తేయాలి : టీడీపీ

కడప (మారుతీనగర్), మార్చి 11: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిపై పెట్టిన అక్రమ కేసును ఎత్తేయాలని సీకేదిన్నె మండల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పుత్తా ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీకేదిన్నె మండల టీడీపీ ఇన్‌చార్జ్ క్రిష్టారెడ్డి, నాయకులు డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి,సీకేదిన్నె సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే కేసులు

కడప(రూరల్), మార్చి 11 :రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటమి భయంతోనే పుత్తా పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని టీడీపీ నాయకులు ఏటూరు రామచంద్రారెడ్డి, గండం మోహన్‌బాబు, ఎం.ఎ బాషా సాహేబ్, ఆవుల నాగేశ్వర్‌రెడ్డి, పి.శంకర్, మునీంద్ర యాదవ్, గంగాదర యాదవ్, సిరాజ్‌బాషా, నరసింహులు యాదవ్ పేర్కొన్నారు. సోమవారం 17వ డివిజన్‌లోని టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 16, 17, 18 డివిజన్ల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మా కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదు: సాయినాథ్‌శర్మ

కమలాపురం రూరల్, మార్చి 11 : మా కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కాశీభట్ల సాయినాథ్‌శర్మ పేర్కొన్నారు. సోమవారం ఆయన తన కార్యాయలంలో విలేకరులతో మాట్లాడుతూ పెద్దచెప్పలి, కొండాయపల్లె పంచాయతీల్లో తన అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఉన్నారని, వారికి అండగా ఉంటానన్నారు. మా కార్యకర్తలను భయభ్రాంతలకు గురి చేసి విచక్షణారహితంగా కొట్టారన్నారు. పుత్తా నరసింహారెడ్డి వర్గానికి చెందిన ఐదుగురు రౌడీలు పట్టపగలు తన వర్గీయులైన నాగరాజు, సురేష్, నాగరాజు ఆచారి, ప్రసాద్‌లను పెద్దాయన రమ్మంటున్నాడని కారులో ఎక్కించుకుని పోవడంతో పుత్తా వారిపై దాడి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

40 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో పుట్టా సుధాకర్‌యాదవ్

చాపాడు, మార్చి 11: మండలంలోని వెంగమ్మగారిపల్లె గ్రామంలో వైసీపీకి చెందిన 40 కుటుంబాలవారు సోమవారం టీడీపీలో చేరారు. మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరినవారిలో వెంకటసుబ్బారెడ్డి, కుళాయిరెడ్డి, కొండారెడ్డి, యల్లారెడ్డి, బాలసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, రామసుబ్బారెడ్డి, రాజారెడ్డి, నడిపి యల్లారెడ్డి, మరో 30కుటుంబాలవారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సత్యం, అమర్ పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల ఆత్మీయ సమావేశం

జమ్మలమడుగు, మార్చి 11: జమ్మలమడుగు పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ప్రధాన రోడ్డు పక్కన ఖాళీ వెంచర్లలో మంగళవారం ఉదయం 9 గంటలకు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం జమ్మలమడుగులోని సమావేశ సభావేదిక ఏర్పాట్ల వద్ద వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గంలోని టీడీపీ,జనసేన కార్యకర్తలు, దేవగుడి అభిమానులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నవనీశ్వరరెడ్డి, నల్లగట్ల బూసిరెడ్డి, తులసిరెడ్డి, జంబాపురం రమణారెడ్డి, పొన్నతోట శ్రీను, మల్లికార్జున పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

మైలవరం, మార్చి 11: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభావతి సోమవారం తెలిపారు. 6, 7 తరగతుల్లో ఖాళీగాఉన్న సీట్ల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 25వ తేదీన జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఆమె తెలిపారు.

వెలవలిలో నూతన సచివాలయం ప్రారంభం

రాజుపాలెం, మార్చి 11 : మండల పరిధిలోని వెలవలి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన నూతన సచివాలయాన్ని సోమవారం ఎంపీపీ వెలవలి నారాయణరెడ్డి ప్రారంభించారు. సచివాలయంతో పాటు ఆర్‌బీకే భవనం, హెల్త్ సెంటరు భవనం కూడా త్వరలో ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు అంజనీదేవి, సర్పంచ్ మహబూబ్‌బాషా, రాజారామిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అరాచకపాలన పోవాలంటే టీడీపీ రావాలి

ప్రొద్దుటూరు, మార్చి 11 : రాష్ట్రంలో అరాచక పాలన పోవాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గోపవరం పంచాయతీ లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బోడెల బాబుల్‌రెడ్డి, రాజుపాళెం మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, ఆవుల దస్తగిరి, తాటి శ్రీను, మార్తలసుబ్బారెడ్డి, ప్రతాప్ రెడ్డి, నాదెండ్ల షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు టౌన్..: మున్సిపల్ పరిధిలో సోమవారం నెల్లూరు రోడ్డులో అంజనేయనగర్, రాధాక్రిష్ణనగర్, కొండారెడ్డినగర్, నౌషద్ థియేటరు సర్కిల్, నాగభూషణం లైన్, కోదండరామ రైస్‌మిల్లు లైన్ తదితర కాలనీల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర జోరుగా సాగింది. ఈ యాత్రలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీష్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న ఇంటింటికీ తిరిగి టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రజలకు వివరిస్తూ సైకిలు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీ పీ నాయకులు మాజీ మార్కెట్‌యార్డు వైస్‌ఛైర్మన్ కనుమర్లపూటి ప్రసాద్, రాగిమాను ప్రతాప్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు నాగభూషణం, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, సింగరయ్య, సింగసాని విజయ్, చెన్నక్రిష్ణారెడ్డి, శ్రీధర్‌నాయుడు, శివయ్యస్వామి, నరసింహనాయుడు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన..: రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జరోశన్న,అరుణ పేర్కొన్నారు. సోమవారం ఆకులనారాయణపల్లె గ్రామంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డితో కలిసి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి,పంగా రవీంద్రారెడ్డి,అక్కి,హబీబున్నీసా,రమణారెడ్డి,నరసింహులు,ఈశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డికే.,దుగ్గిరెడ్డి,హోండా రవీంద్రారెడ్డి,అబ్జర్వర్ చెంద్రాయుడు,క్రిష్ణంపల్లె క్రిష్ణారెడ్డి,నడిపి వెంకటసుబ్బయ్య,వెంకటరెడ్డి,నరసింహారెడ్డి,రామచంద్ర నాయుడు,సుబ్బారావు పాల్గొన్నారు.

అట్లూరు..: అట్లూరు మండలంలోని ప్రజలందరూ టీడీపీ వైపు ఉన్నారని బద్వేలు యువనేత రితీష్‌రెడ్డి, బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న అన్నారు. అనంతరం వరికుంట సర్పంచ్ రమణ టీడీపీలో చేరారు. అట్లూరు ఎస్సీ కాలనీ, ఆకుతోటపల్లె, చింతవాండ్లపల్లె గ్రామాల్లో సోమవారం ప్రజా ఆశీర్వాదయాత్ర నిర్వహించారు. టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అట్లూరు టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జయక్రిష్ణారెడ్డి, విష్ణువర్థన్‌రెడ్డి, సుధారాణి, బోవిళ్ల నంద గోపాల్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, రెడ్డయ్య, మహేశ్వర్‌రెడ్డి, చింతవాండ్లపల్లె నరసింహారెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, మట్టి గంగిరెడ్డి, మస్తాన్, నరసింహులు, కోనయ్య, సంజీవ్, శివయ్య, స్వామి, సుదర్శన్‌రావు, బాలకోటయ్య, ఎం.రామసుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు, లింగారెడ్డి

ప్రొద్దుటూరు..: మూడు రాజధానుల పేరిట రాష్ట్ర ప్రజలను వంచించిన మూర్ఖుడికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారంచౌటపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొండారెడ్డి, నాగమునిరెడ్డి, బచ్చల ప్రతాప్, చౌటపల్లె రమణారెడ్డి, ధనిరెడ్డి శ్రీధర్‌రెడ్డి,గూడా మల్లికార్జునరెడ్డి, డీఈ శివారెడ్డి, ద్వారకచర్ల రాఘవరెడ్డి, జీసీ పుల్లయ్య, గోపవరం లక్ష్మణ్ వద్ది బాలుడు, తలారి పుల్లయ్య, కాకుమాని ఆనంద్ ఎరన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు..: వైసీపీ అవినీతి దౌర్జన్య రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు వచ్చాయని టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేష్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం దేవాంగ పేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేట్టారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ ఛైర్మెన్ వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్ రెడ్డి , మాజీ ఎంపీపీ శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: మహిళల అభివృద్ధే తెలుగుదేశం ధ్యేయమని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం ఖాజీపేటలోని బీసీకాలనీ, బీచువారిపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు గజమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లోత్ర, టీడీపీ నాయకులు వెంకటసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, హరినాథరెడ్డి, నాగశివారెడ్డి, వీరయ్య, సుబ్బయ్య, ప్రతాప్‌రెడ్డి, గోవిందు సుబ్బయ్య, జెండాల మాబాష, సిద్దారం కదీరుల్లా, హబీబ్, హర్షద్, కేకే బ్రదర్స్, రమేష్‌నాయుడు, శ్రీనివాసులు, రాము, శివారెడ్డి, క్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా అట్లూరులో వడలు కాలుస్తున్న బొజ్జ రోశన్న, రితీష్‌రెడ్డి తదితరులు

రేపు డయల్ యువర్ డీఎం

మైదుకూరు, మార్చి 11 : ఆర్టీసీలో సమస్యలు, సలహాలపై ప్రయాణికుల కోసం బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9959225781 నెంబరుకు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

శివరాత్రికి 7.3 లక్షల ఆదాయం..: మహాశివరాత్రి సందర్భంగా భక్తుల కోసం వివిధ శైవ క్షేత్రాలకు 33 బస్సులను నడపగా రూ. 7,03,299 ఆదాయం లభించినట్లు డీఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

పోరుమామిళ్ల , మార్చి 11 : సుస్థిర అభివృద్ధి కోసం హోలిస్టిక్ శాస్త్రాలు, నవీకరణ సందర్భాలు అనే అంశంపై ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ జాతీయ శాస్త్రవిభాగం సంయుక్తంగా జాతీయ సమ్మేళనం ఈ నెల 15,16 తేదీల్లో పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నిర్వహించనున్నారు .ఈ సమ్మేళనంలో ప్రముఖులు ఇతర రాష్ట్రాల నుంచి హాజరవుతారని వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బ్రోచర్ ఆవిష్కంచారు. కార్యక్రమంలో అధ్యాపకులు సులోచన, వెంకటరావు, శ్రీధర్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వెల్లాల దేవస్థానం ఛైర్మన్‌గా జగదీశ్వర్‌రెడ్డి

రాజుపాలెం, మార్చి 11 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ, సంజీవరాయస్వామి భీమలిగేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా సోమవారం బుక్కసముద్రం జగదీశ్వర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ట్రస్టు బోర్డు మెంబర్లుగా బీరం వెంకట్రామిరెడ్డి, నల్లదిమ్మ సౌజన్యలక్ష్మి, సుప్రజ , నాగెళ్ల ఆనందుడు, దగ్గుబాటి రమాదేవి, మంగళి సుబ్బలక్షుమ్మ, కొరపాటి దానమ్మ, పెద్దరామిగాళ్ల రాములమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఇన్‌స్పెక్టరు నరసింహసింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ నారాయణరెడ్డి, బలరామిరెడ్డి, రాజారెడ్డి, గౌతంరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా చూడాలి:ఎంపీడీవో

మైలవరం, మార్చి 11: వేసవిలో గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శంషాద్ బాను, ఎంపీపీ సావిత్రి అన్నారు. సోమవారం మైలవరం ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నీటి సమస్య లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా ముందస్తుగా దృష్టి సారించామన్నారు. వద్దిరాల గ్రామంలో నీటి సమస్య ఉందని ఒకటి,రెండు రోజుల్లో సమస్య తీరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రూపేష్, ఈఓపీఆర్డీ అనురాధ, మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వైసీపీ కౌన్సిలర్ల ధ్వజం




నీటి సమస్యపై మాట్లాడుతున్న వైసీపీ కౌన్సిలర్లు

బద్వేలు టౌన్, మార్చి 11 : రాబోవు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీలోని వార్డుల్లో ఎలాంటి తాగునీటి సమస్యలు కలగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టామని మున్సిపల్ ఛైర్మన్ రాజగోపాల్ రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో సోమవారం నిర్వహించిన కౌన్సిలర్ల సమావేశంలో నీటి సమస్యపై వైసీపీ కౌన్సిలర్లే ధ్వజమెత్తారు. ఆయా వార్డులు 2, 7, 3 తదితర వార్డుల్లో నీటి సమస్య అధికంగా ఉందని, సమయపాలన లేకుండా కొన్నివార్డుల్లో నీటిని సరఫరా చేస్తున్నారని అనేక మార్లు సమావేశం దృష్టికి తెచ్చినప్పటికీసమస్యలు పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారని వైసీపీ కౌన్సిలర్లు మున్సిపల్ సమావేశంలో ధ్వజమెత్తారు. కొన్ని వార్డుల్లో బ్రహ్మంసాగర్ నుంచి పైపులైన్లు పూర్తి కాలేదని ఎప్పటికప్పుడు సమావేశం దృష్టికి తెస్తున్నా అధికారులు స్పందించడంలేదని కొంత మంది వైసీపీ కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తెచ్చారు.

305 మంది బైండోవర్

బి.కోడూరు, మార్చి 11: సార్వత్రిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని మండలంలో 305 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ జయరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా ఎన్నికలు జరుపుకోవాలని రాత్రి సమయంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలే తప్ప పంతాలకు పోయి కొట్లాటలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ గ్రామోత్సవం



బ్రహ్మంగారిమఠం, మార్చి 11 : వీరబ్రహ్మేంద్ర స్వామి సన్నిధానంలో మహాశివరాత్రి మహోత్సవాలు నాలుగు రోజుల నుంచి అత్యంత వైభవంగా వైభవంగా చేపట్టారు. దూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు భోజన, తాగునీరు సదుపాయాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు. అలాగే క్యూలైన్ల వద్ద మంచినీరు. మజ్జిగ భక్తులకు పంపిణీ చేశారు. చివరి రోజు సోమవారం వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ స్వామి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకుముందు ఆదివారం రాత్రి పుష్ప రథోత్సవం చేపట్టారు. సోమవారం వైభవంగా మహాశివరాత్రి మహోత్సవాలు ముగిసినట్లు ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ తెలిపారు.

అమృతనగర్‌లో కొత్త బోరు ఏర్పాటు



ప్రొద్దుటూరు, మార్చి 11 : కొత్తపల్లె పంచాయతీలోని అమృతనగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి యుద్ధప్రాదిపతికన రామాలయం వద్ద తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరాతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు పంచాయతీ జనరల్ ఫండ్ నిధుల నుంచి 11 లక్షలు ఖర్చు చేసి ప్రజలకు ఇబ్బందులు రాకుండా తాగునీటి సమస్య పరిష్కరించామన్నారు. అమృతనగర్‌లో కొందరు అధికార పార్టీ పెద్దలు తాము ఏదో చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే రాచమల్లుపై పరోక్ష విమర్శలు గుప్పించారు. వేసవిలో ఇలాంటి నీటి కష్టాలు రాకుండా అప్రమత్తంగా వుంటూ తాగునీటిని అందిస్తామన్నారు.

ఈశ్వరీదేవి మఠంలో వేలం పాట

బ్రహ్మంగారిమఠం, మార్చి 11 : జగన్మాత ఈశ్వరీదేవి దేవస్థానంలో మార్చి 13న వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. మఠంలో కొబ్బరి ముక్కలు వసూలు చేసుకునేందుకు రూ.50వేలు డిపాజిట్ చెల్లించాలని, మరుగుదొడ్ల నిర్వహణ రుసుం వసూలు చేసుకునేందుకు రూ.30వేలు, తలనీలాలు వసూలు చేసుకునేందుకు రూ.25వేలు, పాదరక్షలు భద్రపరుచకునేందుకు రూ.10వేలు, అమ్మవారి చీరలు రూ.2వేలు మొత్తం నగదు రూపంలో ఈశ్వరీదేవి మఠం ఆఫీసు కార్యాలయంలో చెల్లించి వేలం పాటలో 13వ తేదీ వేలం పాటలో పాల్గొనాలన్నారు. 1.4.2024 తేదీ నుంచి 31.3.2025 వరకు వేలంపాటదారులు హక్కు కలిగి ఉంటారని ఈవో జగన్మోహన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు.

బాండ్ల వివరాలు వెల్లడించేవరకు ఎన్నికలు వాయిదా వేయాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 11: ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేసేవరకు ఎన్నికలు వాయిదా వేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్టేట్‌బ్యాంకు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడులూ ఎలక్ట్రోలర్ బాండ్ల విధానం వలన భారీ ఎత్తున అవినీతి జరిగిందని, బాండ్ల రూపంలో వచ్చిన డబ్బులతో అధికార పార్టీలు ఎన్నికలను శాసిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చెన్నారెడ్డి, మధు, కిరణ్, బాలసుబ్బయ్య, ముంతాజ్‌బేగం రాములమ్మ, లక్ష్మీదేవి, మల్లికాభాను తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: ఎస్‌బీఐ ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే బయట పెట్టాలని సీపీయం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం పోరుమామిళ్లలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సీపీయం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే ఎన్నికలబాండ్ల వివరాలను సుప్రీం తీర్పు ప్రకారం బహిర్గతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీయం నాయకులు గౌసియాబేగం, బీబీ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు..: ఎన్నికల బాండ్ల లావాదేవీలపై మార్చి 13వ తేదిలోపు సుప్రీంకోర్టుకు ఎస్‌బీఐ అన్ని బ్రాంచ్‌లు తెలియజేయాలని కోరుతూ సోమవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డులోని ఎస్‌బీఐ బ్రాంచ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల బాండ్ల చట్టం చెల్లదని, ఈ చట్టం పౌరుల ప్రాథమిక హక్కులను హరించేలా ఉందని వ్యాఖ్యానిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎస్‌బీఐ ఎన్నికల బాండ్ల వివరాలు ఇస్తామనడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీను, చిన్ని, షరీఫ్, ఆంజనేయులు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే, ఆయన బావమరిది సొంత జమానాగా మారిన మున్సిపాలిటీ

ఎమ్మెల్యే రాచమల్లు పై మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫైర్

ప్రొద్దుటూరు, మార్చి 11 : ఐదేళ్లుగా మున్సిపాలిటీ జీతం తీసుకుంటూ వైసీపీ ఎమ్మెల్యే సేవలు చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే కమిషనర్ పై ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి హెచ్చరించారు. సోమవారం నెహ్రూరోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు మున్సిపాలిటీ, ప్రభుత్వ ఆసుపత్రిలో హరిబాబు, వెంకటేశ్వర్లు, నలవల శివారెడ్డి, సంపత్ కుమార్, ప్రభావతి అనే వారు మున్సిపాలిటీలో జీతం తీసుకుంటున్నారన్నారు. వీరంతా ఎమ్మెల్యే డ్రైవర్లు, ఇంటిలో వంట, పనిమనుషులు, వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జీలుగా పనిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఆయన బావమరిది బంగారురెడ్డి మున్సిపాలిటీని తమ సొంత జమానాగా భావించి ఎన్నడూ లేని సాంప్రదాయాన్ని మొదలు పెట్టారన్నారు. అంతేకాకుండా మున్సిపాలిటీలో కోట్ల రూపాయల పెద్ద,పెద్ద కాంట్రాక్టులన్నీ ఒకే వ్యక్తి చేసుకుంటున్నట్లు ఆరోపించారు. వలంటీర్లు టీడీపీకి శత్రువులు కాదు. వారు ప్రభుత్వం సేవలు మాత్రమే చేస్తే అభ్యంతరం లేదన్నారు. వైసీపీ కార్యకర్తలుగా పనిచేస్తూ టీడీపీకి వ్యతిరేక ప్రచారం చేస్తేనే వారిపై ఫిర్యాదు చేస్తామన్నారు. టీడీపీ వచ్చినా వారిని తొలగించబోమని వారి సేవలు టీడీపీ ప్రభుత్వంలో సైతం వాడుకుని వారి కష్టానికి తగ్గట్లు వేతనాలు ఇస్తామన్నారు. ఇంటింటికి వచ్చే వలంటీర్ వైసీపీ ప్రచారం చేస్తే ప్రజలు నిలదీయాలని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, వెంకట కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతం అయిన భూములను స్వాధీనం చేసుకోవాలి

బద్వేలు, మార్చి 11: ఒకటిన్నర కాల నుంచి గోపవరం మండలం పీపీ కుంట వద్ద గుడిసెలు వేసుకుంటున్న పేదలను భయభ్రాంతులకు గురిచేస్తున్న బద్వేలు ఆర్డీవో తీరు సరికాదని, కాశినాయన మండలం అక్కెంగుండ్ల నుంచి అట్లూరు మండలం వరకు అన్యా క్రాంతం కబ్జా అయిన ప్రభుత్వ భూములను పరిరక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో తీరును నిరసిస్తూ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ నిరుపేదలు ఇంటి స్థలం కోసం అనేకసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని, ఈ విషయమై ఆరు నెలల క్రితం ఆర్డీవోకు దరఖాస్తులు అందజేసినా స్పందించలేదన్నారు. పట్టణంలో ప్రభుత్వ భూములు, కొండలు, వాగులు, కల్వర్టులు, ఆర్టీసీ షెల్టర్ సైతం ఆక్రమించుకుంటుంటే వారి వద్ద ముడుపు తీసుకున్న రెవెన్యూ యంత్రాంగం పేదలపై జులుం ప్రదర్శించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్, సమితి సభ్యుడు వెంకటరమణ, దళితహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఇమ్మానుయేల్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఖాదర్‌బాష, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు